క్లుప్తంగా

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో మున్నూరు కాపు సంఘం సభ్యులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ కోసం రామాయంపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు శనివారం నాటికి 52 రోజులకు చేరుకున్నాయి. మూన్నూరు కాపు సంఘం రెండో బేడకు చెందిన సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు రమేశ్‌రెడ్డి, దోమకొండ యాదగిరి, సుంకోజ దామోదర్, వినయ్‌సాగర్, నరేశ్, శేఖర్, అల్లాడి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకం



మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామశివారులోని సర్వే నంబర్ 914లో కొద్ది రోజులుగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. జాతీయ రహదారి 44 పేరిట ఉదయం, రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మైనింగ్ ఏజీఎం దినేశ్, మాసాయిపేట గిర్దావర్ ధన్‌సింగ్‌లు మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత భూ యజమానికి కొలతల ప్రకారం జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఏఓ

వెల్దుర్తి(తూప్రాన్): మండల వ్యాప్తంగా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఇన్‌చార్జ్ ఏఓ సాయికుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పీఏసీఎస్ సొసైటీ ద్వారా రైతులకు 65వ శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తుందని, విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలను తీసుకొని రావాలని సూచించారు. 65 శాతం సబ్సిడీ పోను 30 కేజీల జీలుగ బస్తా ధర 842.70, 40 కేజీల జనము బస్తా ధర రూ.1225 ఉందన్నారు. ఒక బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు వాడడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జ్ఞాపకాలు నిలిచిపోవాలని..



సంతకాల టీషర్టులు ధరించిన విద్యార్థులు

మెదక్‌జోన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ లైఫ్ సైన్స్ విద్యార్థులు మిత్రుల జ్ఞాపకాలు నిలిచిపోవాలని సంతకాల దినోత్సవం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ గణపతి తెలిపారు. ఈ సందర్భంగా ఫైనల్ ఇయర్ విద్యార్థులంతా తెల్లని నూతన టీ షర్టులపై ప్రిన్సిపాల్, తమకు బోధించిన అధ్యాపకులు, విద్యార్థుల సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు దినకర్, రాజు, మురళి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా



గాయపడ్డ ఇద్దరు కూలీలు

అల్లాదుర్గం(మెదక్): అతివేగంతో ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన అల్లాదుర్గం శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దశంకరంపేట వైపు నుంచి బోడ్మట్‌పల్లి గ్రామంలో గుడి నిర్మాణ పనులకు కూలీ పనికి ఇద్దరు ఆటోలో వెళ్తున్నారు. అల్లాదుర్గం శివారులో ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తు ఆటోను అతివేగంగా నడపడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ మోహన్



నర్సాపూర్‌రూరల్: అవగాహన కల్పిస్తున్న రవీందర్, పురపాలక సిబ్బంది



తూప్రాన్: ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు

తూప్రాన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ మోహన్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మానవ మనుగడకే ముప్పు అన్నారు. ఈ విషయంలో విద్యార్థులు, యువత ప్రజల్లో అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం పర్యావరణం కోసం కృషి చేస్తామని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, కమిషనర్ మోహన్, పీయూసీ కంట్రోల్ ఆఫీసర్ రవీందర్, మేనేజర్ రఘువరన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్‌రూరల్: జూన్ 5న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించనున్నట్లు నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ పురపాలక సంఘం పరిధిలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించుటకు జీవన విధానం మార్పు చేసుకోవాలన్నారు. ప్రకృతి సిద్ధంగా బ్రతకాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈకో ఫ్రెండ్లీ సిస్టం ద్వారా ప్రతి ఒక్కరూ విధిగా పర్యావరణ అనుకూల పద్ధతులు పాటిస్తూ సహజ సిద్ధ వనరులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ విభాగం అసిస్టెంట్ పర్యావరణ సైంటిస్ట్ రవీందర్, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడిపల్లి(నర్సాపూర్): మండలం కేంద్రం కొడిపల్లిలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐడీసీఎస్ మండల సూపర్‌వైజర్లు శశికళ పర్యవేక్షించారు. ఏఎన్ఎం సిరోమణి, శోభ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరం ఉన్నవారికి వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. రక్తహీనత ఉన్నవారికి గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ప్రతీ నెల క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తహీనతను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుమిత్ర, ఆశవర్కర్ చెన్నమ్మ పాల్గొన్నారు.

చాకరిమెట్లలో ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ రాజు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో భక్తులు వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడేవారికి సీఎం ఆర్ఎఫ్ భరోసా అందిస్తుందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డుకు చెందిన త్రిపురేశ్వర్ చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ సందర్భంగా అతడికి మంజూరైన రూ.60వేల చెక్కును శనివారం కౌన్సిలర్ గుంటుకు శిరీష కలిసి పట్టణంలోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారన్నారని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రజిత, అత్తెల్లి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ సయ్యద్ మథిన్, నాయకులు నర్సింగరావు, సమీర్, తోట శ్రీనివాస్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరామర్శ**



శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన దివంగత నేత నర్సాపూర్ నియోజకవర్గ సమితి అధ్యక్షుడు నాయిని ప్రద్యుమ్నరెడ్డి భార్య నాయిని అనసూయమ్మ(90) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. కాగా శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరగగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, వైస్‌ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, కోషాధికారి బండారి గంగాధర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి సభ్యుడు రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బాల వీరహనుమాన్ ఆలయంలో పూజలు**

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని బాల వీరహనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. శనివారం ఆలయం నిర్మాత, గ్రామ పురోహితుడు మెట్టురాములుశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి చందన అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

◆ **రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు**

రేగోడ్(మెదక్): వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని స్థానిక తహసీల్దార్ లక్ష్మణ్ శనివారం తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని, కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. తూకంలో మోసం చేస్తే, తగిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

◆ **సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అగ్రహారం గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళజాత నిర్వహించారు. శుక్రవారం రాత్రి ప్రజలను చైతన్యం పరిచేలా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పోచయ్య మాట్లాడుతూ.. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పొద్దన్నారు. ఓటీపీ చెప్పడం ద్వారా డబ్బులు కోల్పోతున్నారని చెప్పారు. ప్రజలు అప్రమత్తతో సైబర్‌నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, పోలీస్‌లు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్త భార్య వైద్య ఖర్చుల కోసం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అందజేశారు. హవేళిఘనపూర్ మండలంలోని బ్యాతోల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ప్రభాకర్ భార్య స్వరూప తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే వెంటనే స్పందించి, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50లక్షల ఎల్‌ఓసీని ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టం వచ్చిన ప్రతీ కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. ప్రభాకర్ కుటుంబీకులు, గ్రామస్తులకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. పథకం ద్వారా చాలా మంది పేదలకు ఆర్థిక సాయాన్ని సీఎం కేసీఆర్ అందిస్తున్నారని ఆమె చెప్పారు. శనివారం పట్టణంలో ఇతర మండలాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశానని ఆమె చెప్పారు.

మహిళ అదృశ్యం



మాణెమ్మ

టేక్మాల్(మెదక్): మహిళ అదృశ్యమైన సంఘటన టేక్మాల్ మండలంలోని వెల్పుగొండ గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుడు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధం మాణెమ్మ కుమారుడు మెదక్‌లో నివాసముంటూ పని చేసుకుంటుండగా, వెల్పుగొండ ఇంట్లో మాణెమ్మ ఒక్కతే నివాసముంటుంది. పక్కింట్లో ఉండే కుటుంబ సభ్యులకు ఎవరికి చెప్పకుండా వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద వెతికినా.. ఆచూకి లభించలేదు. ఆమె ఇంటి నుంచి వెళ్లేప్పుడు నల్లటి చీరతో ఉందని, చామని చాయ రంగు, గుండ్రని ముఖం కల్గి ఉందని తెలిపారు. ఈ మేరకు మాణెమ్మ కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మాణెమ్మ ఎవరికైనా కనిపిస్తే టేక్మాల్ పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్ 87126 57925ను సంప్రదించాలని సూచించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

దుబ్బాకటౌన్: ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. శనివారం పట్టణంలోని 14వ వార్డులో కౌన్సిలర్ ఆస యాదగిరితో కలిసి బోదకాలు రోగులకు నివారణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోదకాలు నివారణకు అందిస్తున్న ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేవుని లలిత, ఏఎన్ఎంలు బాల్‌నర్సవ్వ, ప్రేమలత, ఆశ వర్కర్ సంతోష ఉన్నారు.

తహసీల్దార్ తీరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ మాసుల శ్రీనివాస్

వాడీవేడీగా చేగుంట మండల సర్వసభ్య సమావేశం

చేగుంట(తూప్రాన్): రైతుల ధాన్యం దింపుకోవడానికి ఇబ్బందులు కల్గించిన తహసీల్దార్ లక్ష్మణబాబుపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ హోలియా, సర్పంచ్ స్వర్ణలత మండల సర్వసభ్య సమావేశంలో పేర్కొన్నారు. శనివారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అధ్యక్షతన చేగుంట మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ హోలియా మాట్లాడుతూ.. పోతాన్‌పల్లి, చెట్లతిమ్మాయిపల్లి తండాల రైతులకు సంబంధించిన ధాన్యం చందాయిపేట రైస్‌మిల్లులో కొన్ని దింపాలని జిల్లా అధికారులు సూచించగా అక్కడ ధాన్యం దింపకుండా తహసీల్దార్ అడ్డుకున్నారని ఆరోపించారు. రైతులకు సహకరించని తహసీల్దార్ లక్ష్మణబాబు చేగుంట మండలానికి అవసరం లేదని తీర్మానం చేయాలన్నారు. రిజిస్ట్రేషన్‌ల విషయంలో సామాన్య రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ రియల్ వ్యాపారులకు తహసీల్దార్ సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, త్వరలోనే కలెక్టర్‌తో తహసీల్దార్ విషయంపై ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. తెలంగాణ అవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీఓ సతీశ్ సర్పంచ్‌లను కోరగా.. ఉత్సవాల నిర్వహణకు ముందుగానే డబ్బులు జమ చేయాలని గొల్లపల్లి సర్పంచ్ ఎల్లారెడ్డి సూచించారు. 515 మంది గొర్రెల పంపిణీకి అర్హులుగా ఎంపికై నట్లు అందరు తమ వాటాగా డబ్బులను జమ చేయాలని అసిస్టెంట్ పశువైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సర్పంచ్ ఎంపీటీసీలు మరోవారం అందించాలని ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ కోరారు. అభివృద్ధి కోసం పేద రైతుల వద్ద తీసుకున్న ప్రభుత్వ భూమిని ఇతర జిల్లాకు చెందిన వ్యక్తికి ఇవ్వడం రద్దు చేయాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనందమేరీ, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, సర్పంచ్‌లు స్వాతి, లక్ష్మి, శ్రీనివాస్, ఎంపీటీసీలు కవిత, నవీన్, రవి, వెంకటలక్ష్మితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లారీల సమస్య పరిష్కరించండి



రంగాయపల్లి కొనుగోలు కేంద్రం వద్ద నిరసన చేస్తున్న రైతులు

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తమ ధాన్యాన్ని బస్తాల్లో నింపినా.. లారీలు లేక కేంద్రం వద్దనే నిల్వ ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని రంగాయపల్లి గ్రామం వద్ద ఐకేపీ కొనగోలు కేంద్రం వద్ద రంగాయపల్లి, చెట్లగౌరారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి లారీల్లో రైస్‌మిల్‌కు తరలిస్తామని చెబుతున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదని వాపోయారు. అసలే వర్షాలు ఎప్పుడు పడుతున్నాయో అర్థం కాని పరిస్థితిలో ఉన్నామని, అధికారులు తక్షణమే స్పందించి లారీలను ఏర్పాటు చేసి, ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లుకు తరలించేలా కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రమాబాయికి పలువురి నివాళి



నర్సాపూర్:రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆయా సంఘాల ప్రతినిధులు



పెద్దశంకరంపేటలో..

నర్సాపూర్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సతీమణి రమాబాయి గొప్ప మహనీయురాలుగా స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రమేశ్ అన్నారు. శనివారం ఆమె వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె గొప్పతనాన్ని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో రమేశ్‌తో పాటు కుల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహిద్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు శంకర్, ఇతర ప్రతినిధులు రఫీ, సంజీవ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో రమాబాయి చిత్రపటానికి కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్, విగ్రాం రామాగౌడ్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తి, గంగాధర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, నాగరాజు, కృష్ణ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

నర్సాపూర్: ఇమ్రాన్‌పై దాడి చేసిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని స్వేచ్ఛ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రమేశ్, కో కన్వీనర్లు వహిద్, శంకర్‌ల బృందం శనివారం నర్సాపూర్‌లో పర్యటించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... ఈనెల 5న గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో జరిగిన వివాదాన్ని సాకుగా చూపి హనుమాన్ స్వాములు ఇమ్రాన్‌పై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇమ్రాన్‌పైనే కేసు నమోదు చేసి జైలుకు పంపడం అన్యాయమని వారన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, ఇమ్రాన్‌పై కేసులు ఎత్తి వేయాలని రమేశ్, వహిద్, శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. వారి వెంట దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు సంజీవ, కుల నిర్మూలన సంఘం నాయకుడు రఫీ తదితరులు ఉన్నారు.

రవాణా ఇబ్బందులు లేకుండా చూస్తాం



కొల్చారం రైస్‌మిల్లులో ధాన్యం అన్‌లోడ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు రవాణా, అన్‌లోడ్ చేయడంపై రైతుల నుంచి వస్తున్న ఒత్తిళ్లపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పోతంశెట్టిపల్లి, కిష్టాపూర్, రాంపూర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయడంతో పాటు లారీలు, ట్రాక్టర్లలో ధాన్యం రవాణా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. రైస్‌మిల్లుల యజమానులు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసి, ఖాళీ అయిన లారీలను, ట్రాక్టర్లను తిరిగి కొనుగోలు కేంద్రాలకు వెళ్లేలా కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం వహించొద్దని సూచించారు. రైతులకు అధికారులు పూర్తి అందుబాటులో ఉన్నారని ఈ సందర్భంగా తహసీల్దార్ పేర్కొన్నారు.